'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 33 | గురువారం | 17.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 33 | Thursday | 17.9.2026 | Pages: 8 | Rate: 2



## యూపీఐ చార్జీల అసలు లెక్క

• అక్టోబర్ 15 నుంచి కొత్త నియమాలు • యూపీఐపై రుసుము ఎవరు చెల్లించాలి?

అక్టోబర్ 15, 2026 నుంచి కొన్ని వ్యాపార లావాదేవీలకు యూపీఐపై 0.4 శాతం వ్యాపారి రుసుము అమల్లోకి రానుంది. అయితే ఈ రుసుము వినియోగదారుడిపై నేరుగా పడదు. రూ. 2,000కు మించిన నిర్దిష్ట వ్యాపార చెల్లింపులకు ఈ రుసుము వర్తిస్తుంది. రూ. 75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు గరిష్ఠంగా రూ. 300కే పరిమితం చేశారు. ఉదాహరణకు రూ. 3,000 చెల్లింపుపై రూ. 12, రూ. 50,000 చెల్లింపుపై రూ. 200 రుసుము ఉంటుంది. వినియోగదారుడి బ్యాంకు ఖాతా నుంచి ఈ రుసుము పేరుతో అదనపు మొత్తం కట్ కాదు.



3లో..

## యూపీఐ చార్జీలతో మళ్లీ నగదు ?

**వ్యాపారుల ఆందోళనతో కొత్త చర్చ**

**చిన్న దుకాణాలపై ప్రభావంపై హెచ్చరిక**

అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొన్ని యూపీఐ వ్యాపార లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము అమల్లోకి రానుండటంపై రిటైలర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. చిన్న వ్యాపారులు ఇక యూపీఐ తీసుకోవాలా, నగదు తీసుకోవాలా అని ఆలోచించాల్సిన పరిస్థితి రావచ్చని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యనిర్వహణాధికారి కుమార్ రాజగోపాలన్ అన్నారు. తక్కువ లాభాలతో పనిచేసే చిన్న దుకాణాలకు స్వల్ప రుసుము కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన విధానానికి ఈ మార్పు విరుద్ధంగా మారే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### జనం నెత్తిన యూపీఐ పేన్ను

ట్రంప్ ఒత్తిడికి మోదీ తలొగ్గారు

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి

కొత్త చార్జీలపై రాహుల్ గాంధీ ఫైర్

### యూపీఐ చార్జీలపై తగ్గేదేలేదు

2 వేలు దాటితే 0.4% రుసుము

అక్టోబర్ 15 నుంచి కొత్త విధానం

తేల్చి చెబుతున్న కేంద్ర పెద్దలు

## ఊహాగానాలకు తెర

**బీజేపీతో పొత్తు ఉండదన్న కేటీఆర్**

**2028 ఎన్నికలపై స్పష్టమైన ప్రకటన**

**డీలిమిటేషన్‌కు దామాషా ప్రాతిపదికే షరతు**

2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. హరియాణాలోని సోనిపట్‌లో ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో 'ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఎ స్టార్టప్ స్టేట్' అంశంపై ఉపన్యాసం ఇచ్చిన కేటీఆర్ అనంతరం విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. (వివరాలు 2లో..)





5లో..

# తెలంగాణలో 'భూ'కంపం

## బీఆర్ఎస్ హయాంలో లక్ష కోట్ల భూకుంభకోణం

- అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సంచలనం
- కేసీఆర్ ఫామ్‌హౌజ్‌పై విచారణకు సీఎం ఆదేశం
- మీ భూములు, మా భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా? హరీశ్ సవాల్

తెలంగాణ అసెంబ్లీలో భూముల వ్యవహారం ఒక్కసారిగా రాజకీయ వేడిని పెంచింది. ధరణి పోర్టల్, 22ఏ నిషేధిత భూములు, భూ రికార్డుల మార్పులు, ప్రభుత్వ భూముల పరిరక్షణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర చర్చకు దారితీశాయి. గత పాలనలో ధరణి అమలుతో భూ రికార్డుల్లో చోటుచేసుకున్న పరిణామాలపై ప్రశ్నలు లేవనెత్తిన సీఎం.. ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణకు ఆదేశాలు జారీ చేసి, ప్రభుత్వ భూమి ఉన్నట్లు తేలితే స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని ప్రకటించారు. కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూములపై కూడా సభలో పలు వివరాలు వెల్లడించారు. మరోవైపు 22ఏ జాబితాపై బీఆర్ఎస్ ఇప్పటికే న్యాయ విచారణకు డిమాండ్ చేస్తుండగా, హరీశ్‌రావు ధరణితో పాటు కాంగ్రెస్ హయాంలోని భూ భారతి వ్యవహారాలపైనా సమగ్ర విచారణ జరపాలని సవాల్ చేశారు. దీంతో 'ధరణి తప్పిదాలా? భూ భారతి పరిణామాలా?' అన్న ప్రశ్నలతో రెండు పార్టీల మధ్య భూయుద్ధం మరింత ముదిరింది. ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య అసలు నిజం తేల్చాల్సింది మాత్రం భూ రికార్డులే. ఏ భూమి ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళ్లింది? ఎవరి నిర్ణయంతో మార్పులు జరిగాయి? ఎవరికి హక్కులు దెబ్బతిన్నాయి? అనే ప్రశ్నలకు అధికారిక రికార్డులు, స్వతంత్ర విచారణ ద్వారా సమాధానాలు దొరకాల్సిన పరిస్థితి ఏర్పడింది. 22ఏ జాబితాపై ప్రభుత్వం తన లెక్కలు చెబుతుండగా, బీఆర్ఎస్ మాత్రం వాటిని ప్రశ్నిస్తోంది. ఈ భూవివాదం ఇక రాజకీయ సభలకే పరిమితం కాకుండా వేలాది భూహక్కులతో ముడిపడిన కీలక అంశంగా మారుతోంది.

వివరాలు2లో..



## ఎర్రవల్లి ఫాంహౌస్‌పై సమగ్ర విచారణ

**30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం**

**700 ఎకరాలపై లెక్క తేల్చాలన్న సీఎం**

తెలంగాణ అసెంబ్లీలో 22ఏ భూములపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫాంహౌస్ భూములపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఫాంహౌస్ పరిధిలో మొత్తం ఎంత భూమి ఉంది, ఆ భూముల యాజమాన్య హక్కులు ఎవరి పేర్లలో ఉన్నాయి, ప్రభుత్వ భూమి ఏమైనా ఉందా అనే అంశాలను పూర్తిగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఫాంహౌస్ సుమారు 700 ఎకరాల పరిధిలో ఉందన్న అంశాన్ని కూడా విచారణలో తేల్చాలని సీఎం సూచించారు. 30 రోజుల్లోగా పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు.

## కొందరు వేల ఎకరాలు కొల్లగొట్టారు

**ఆ వివరాలు సభ ముందుంచుతా**

**ధరణి భూములపై రేవంత్ ప్రకటన**

తెలంగాణ అసెంబ్లీలో 22ఏ భూముల అంశంపై జరిగిన చర్చ రాజకీయంగా వేడెక్కింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను ఉపయోగించి భూముల బదిలీల్లో అక్రమాలు జరిగాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కొందరు వేల ఎకరాల భూములను కొల్లగొట్టారని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను శాసనసభ ముందుంచుతానని ప్రకటించారు.



## రెండు ప్రభుత్వాల భూ లెక్కలు తేల్చేద్దామా?

**భూవివాదాలపై న్యాయ విచారణకు సిద్ధమా?**

**కేసీఆర్‌పై వ్యాఖ్యలతో రాజకీయ దుమారం**

**రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ సవాల్**

కేసీఆర్ వ్యక్తిత్వాన్ని ప్రశ్నిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రం కోసం పోరాడిన నాయకుడిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని అన్నారు. "నా ఇల్లు తీస్తే నీకెందుకు బాధ అని రేవంత్‌రెడ్డి అంటున్నారు..



## బీఆర్ఎస్ హయాంలో వేల ఎకరాల కబ్జాలు

**పదేళ్లలో దోచుకున్నారన్న బండి సంజయ్**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు లక్షల ఎకరాల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం ప్రజలకు సొంత భూమి లేదని, దాదాపు 25 లక్షల కుటుంబాలకు ఇంటి స్థలం కూడా లేదని చెప్పారు. ధరణి పేరుతో బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబం భూముల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని తాను గతంలోనే ప్రజలను హెచ్చరించానన్నారు.



## భూములపై కవిత సంచలన సవాల్

**గజం అదనంగా ఉన్నా ప్రభుత్వానికే**

అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించిన ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తానని సవాల్ చేశారు. తన కుటుంబంపై సీఎం చేసిన ఆరోపణలు అసత్యమని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని పేర్కొన్నారు. భూ వ్యవహారాల్లో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సీఎం ప్రస్తావించిన వ్యక్తుల భూములపైనా దర్యాప్తు జరపాలని కోరారు.



## ఆ భూముల లెక్క చెప్పండి

**భూపోరాటాల చరిత్ర కమ్యూనిస్టులదే**

**22ఏ భూములపై కూనంనేని డిమాండ్**

22ఏ నిషేధిత భూములపై శాసనసభలో జరిగిన చర్చలో కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని, 1945 నుంచే భూమి కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారని గుర్తుచేశారు. భూపోరాటాల్లో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ శ్రేణులు సహా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కొమురం భీమ్ వంటి వారు భూమి కోసం పోరాడారని పేర్కొన్నారు.

## ఆగుతున్న హార్ట్ బీట్..వ్యాక్సిన్ పై కొత్త డౌట్



6లో..

**ఆకస్మిక మరణం.. ఆలోచించాల్సిన తరుణం**

**ఆళ్ల నాని మృతి.. గుండెపై కొత్త చర్చ**

మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని ఆకస్మిక మృతి ఒక ప్రశ్నను ముందుకు తెచ్చింది.. గుండెపోటు నిజంగా ఎప్పుడు వస్తుంది? కనిపించడానికి ఆరోగ్యంగానే ఉన్న మనిషి.. రాత్రి నిద్ర మధ్యలో ఒక్కసారిగా లేచిపోవడం, కడుపులో విపరీతమైన ఉబ్బరం, గ్యాస్, నోటి దుర్వాసన, పగటిపూట నిస్సత్తువ, నిద్రలేమి.. ఇవన్నీ సాధారణ సమస్యలేనా? లేక శరీరం ఏదో హెచ్చరిక చేస్తోందా? వ్యాక్సిన్లు, బూస్టర్ డోసుల ప్రభావాలపై సోషల్ మీడియాలో సాగుతున్న చర్చలకు అసలు వైద్య ఆధారాలేంటి? మరోవైపు.. వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. 25 ఏళ్లు.. 35 ఏళ్లు.. 45 ఏళ్లు.. వయసు ఏదైనా.. ఒక్క క్షణం చాలు! ఛాతీలో స్వల్ప అసౌకర్యాన్ని గ్యాస్‌గా భావించడం, అలసటను నిర్లక్ష్యం చేయడం, రక్తపోటు, చక్కెర, కొలెస్ట్రాల్‌ను పట్టించుకోకపోవడం ఎంతటి ప్రమాదానికి దారితీయొచ్చు? అసలు గుండెపోటుకు దారితీసే నిజమైన కారణాలేంటి? ఏ లక్షణాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా గుర్తించాలి? ఆళ్ల నాని ఆకస్మిక మృతి నేపథ్యంలో మొదలైన ఈ చర్చ..



2లో..

## వినాయక నిమజ్జనంలో విషాదం

**చెరువులో మునిగి ఆరుగురి మృతి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్దకంజర్లలో వినాయక నిమజ్జనం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. బుధవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో శివనగర్ క్రాస్‌రోడ్స్‌లోని శిరీష మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు గ్రామ శివారులోని చెరువుకు నిమజ్జనం కోసం వెళ్లారు. చెరువు ట్రస్ట్ వసతి గృహానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. నిమజ్జనం సమయంలో ప్రమాదవశాత్తు విద్యార్థులు చెరువులో పడిపోవడంతో ఆరుగురు నీట మునిగి మృతి చెందారు. మృతులను సిద్ధార్థ్, నరసింహరాజు, సుమంత్‌రెడ్డి, గణేశ్, ఉదయ్‌కిరణ్, శ్యామ్‌కుమార్‌గా గుర్తించారు. వీరిలో ఒకరు పదో తరగతి విద్యార్థి కాగా, మరికొందరు పాలిటెక్నిక్, బీటెక్ చదువుతున్నారు.

## పీఎఫ్ పరిమితి పెంపు

- కోట్లాది ఉద్యోగులకు ఊరట
- రూ.15 వేల నుంచి రూ.25 వేలకు

ఉద్యోగుల భవిష్య నిధి విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్‌వో తప్పనిసరి పరిధిలోని వేతన పరిమితిని నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచింది. దీంతో రూ.15 వేల నుంచి రూ.25 వేల మధ్య వేతనం పొందుతున్న ఉద్యోగులు ఇకపై తప్పనిసరి పీఎఫ్ పరిధిలోకి రానున్నారు. ఈ నిర్ణయంతో అదనంగా 50 లక్షల నుంచి కోటి మంది ఉద్యోగులకు సామాజిక భద్రత ప్రయోజనాలు అందే అవకాశం ఉందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. (వివరాలు 2లో..)





## దానం అర్హతపై హైకోర్టు తీర్పు శుక్రవారం

**నాగేందర్ వ్యవహారంపై పొలిటికల్ రచ్చ**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై హైకోర్టు తీర్పు శుక్రవారానికి వాయిదా పడింది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, అనంతరం కాంగ్రెస్ బీఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారని పేర్కొంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. (వివరాలు 2లో..)

# ఎర్రవల్లి ఫాంహౌస్‌పై సమగ్ర విచారణ

- 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- 700 ఎకరాలపై లెక్క తేల్చాలన్న సీఎం

తెలంగాణ అసెంబ్లీలో 22ఏ భూములపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫాంహౌస్ భూములపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఫాంహౌస్ పరిధిలో మొత్తం ఎంత భూమి ఉంది, ఆ భూముల యాజమాన్య హక్కులు ఎవరి పేర్లలో ఉన్నాయి, ప్రభుత్వ భూమి ఏమైనా ఉందా అనే అంశాలను పూర్తిగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఫాంహౌస్ సుమారు 700 ఎకరాల పరిధిలో ఉందన్న అంశాన్ని కూడా విచారణలో తేల్చాలని సీఎం సూచించారు. 30 రోజుల్లోగా పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు.

**388 ఎకరాలు ప్రభుత్వ భూమేనా?**

ఫాంహౌస్ పరిధిలో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్న ఆరోపణలు ఉన్నాయని రేవంత్‌రెడ్డి సభలో ప్రస్తావించారు. ఆ భూమి ప్రభుత్వానిదిగా విచారణలో తేలితే దాన్ని స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. భూముల హక్కులు, రికార్డులు, గతంలో జరిగిన బదిలీలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. విచారణలో తప్పులు తేలితే సంబంధిత భూములపై ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని సీఎం తెలిపారు. ఈ అంశంపై అధికారులకు స్పష్టమైన గడువు విధించడం అసెంబ్లీలో చర్చకు ప్రధాన కారణంగా మారింది.

**కుటుంబ భూములపైనా లెక్కలు**

కేసీఆర్ కుటుంబానికి చెందిన భూముల వివరాలను కూడా రేవంత్‌రెడ్డి సభలో ప్రస్తావించారు. సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37



ఎకరాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తొమ్మిది జిల్లాల పరిధిలో 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని సీఎం తెలిపారు. ఈ భూములపై కూడా రికార్డులను పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫాంహౌస్ భూములపై వచ్చే 30 రోజుల్లో నివేదికతో అసలు వాస్తవాలు బయటపడే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతోంది.

# కొందరు వేల ఎకరాలు కొల్లగొట్టారు

- ఆ వివరాలు సభ ముందుంచుతా
- ధరణి భూములపై రేవంత్ సంచలనం

తెలంగాణ అసెంబ్లీలో 22ఏ భూముల అంశంపై జరిగిన చర్చ రాజకీయంగా వేడెక్కింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను ఉపయోగించి భూముల బదిలీల్లో అక్రమాలు జరిగాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కొందరు వేల ఎకరాల భూములను కొల్లగొట్టారని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను శాసనసభ ముందుంచుతానని ప్రకటించారు. ధరణి వ్యవస్థ ద్వారా ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, అటవీ భూములు సహా వివిధ రకాల భూముల రికార్డుల్లో మార్పులు జరిగాయని ఆయన ఆరోపించారు. భూ వ్యవహారాలపై ప్రత్యేక విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీస్తామని సీఎం తెలిపారు.

**లక్షల కోట్ల ఆస్తులపై ఆరోపణలు**

ధరణి పేరుతో గత ప్రభుత్వ కాలంలో రూ.లక్షల కోట్ల విలువైన భూములు, ఆస్తులు కొందరి చేతుల్లోకి వెళ్లాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, వారి అనుచరులు ధరణి పోర్టల్‌లోని లోపాలను ఉపయోగించుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన సుమారు 2.5 కోట్ల ఎకరాల భూమికి సంబంధించిన సమాచారం ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిందని సీఎం ఆరోపించారు. రెవెన్యూ డేటాను ప్రభుత్వ సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేట్ సంస్థలకు ఎందుకు అప్పగించారనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. రూ.110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1,400 కోట్ల స్థాయికి ఎలా చేరిందో కూడా విచారణ చేయాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి సభలో ప్రశ్నించారు.

**22ఏ సమస్యలకు కొత్త పరిష్కారం**

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 22ఏ భూములకు సంబంధించిన 12 రకాల సమస్యలను గుర్తించామని, వాటిపై ప్రత్యేకంగా పరిశీలన చేపడతామని తెలిపారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్లలో పెండింగ్ రిజిస్ట్రేషన్లను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. పొరపాటున 22ఏ జాబితాలో చేరిన వ్యక్తిగత భూములను తొలగించే విధానం తీసుకొస్తామని ప్రకటించారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములు, వేలంలో కొనుగోలు చేసిన భూములను కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించే చర్యలు చేపడతామని వెల్లడించారు. ధరణి భూ వ్యవహారాలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న అంశాలన్నింటినీ ప్రత్యేక విచారణకు పంపిస్తామని సీఎం స్పష్టం చేశారు.

# రెండు ప్రభుత్వాల భూ లెక్కలు తేల్చేద్దామా?

- భూవివాదాలపై న్యాయ విచారణకు సిద్ధమా?
- కేసీఆర్‌పై వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ సవాల్

కేసీఆర్ వ్యక్తిత్వాన్ని ప్రశ్నిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రం కోసం పోరాడిన నాయకుడిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని అన్నారు. "నా ఇల్లు తీస్తే నీకెందుకు బాధ అని రేవంత్‌రెడ్డి అంటున్నారు.. కానీ నా బాధ ప్రజల బాధ" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. 22ఏ జాబితా నుంచి ప్రభుత్వ పెద్దల భూములు తొలగించే విధానం ఉంటే, అదే నిబంధనలు సామాన్యుల భూములకు కూడా వర్తించాలని డిమాండ్ చేశారు. ప్రజల భూముల సమస్యలకు పరిష్కారం చూపకుండా రాజకీయ విమర్శలతో సరిపెట్టవద్దని అన్నారు.

**ధరణి నుంచి భూభారతి వరకు విచారణ**

భూముల వ్యవహారంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణిలో జరిగిన అవకతవకలు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూభారతిలో చోటుచేసుకున్న పరిణామాలపై సమగ్ర విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు ప్రకటించారు. అధికారుల ఆధ్వర్యంలో కాకుండా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన వ్యవహారాలతో పాటు 2023 డిసెంబర్ 7 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో జరిగిన భూ లావాదేవీలను కూడా పరిశీలించాలని కోరారు. తమ ఆస్తులు, రేవంత్‌రెడ్డి ఆస్తులు, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తుల పెరుగుదలపైనా న్యాయ విచారణకు సిద్ధమని స్పష్టం చేశారు.

**రేవంత్ కుటుంబ భూములపై కొత్త ఆరోపణలు**

రేవంత్‌రెడ్డి కుటుంబానికి సుమారు 308 ఎకరాల భూమి ఉందన్న సమాచారం తమకు అందిందని హరీశ్‌రావు తెలిపారు. ఆ భూములకు సమీపంలో



ఓఆర్ఆర్ అలైన్‌మెంట్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు వచ్చాయన్న అంశాన్ని ప్రస్తావించారు. ఫ్యూచర్ సిటీ పరిసరాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న భూముల వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఈ ఆరోపణలపై కూడా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. "నీ ఆస్తులు.. మా ఆస్తులు.. రెండు ప్రభుత్వాల భూ వ్యవహారాలు అన్నీ సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిద్దాం.. నువ్వు సిద్ధమా రేవంత్‌రెడ్డి?" అంటూ హరీశ్‌రావు బహిరంగ సవాల్ విసిరారు.

# బీఆర్ఎస్ హయాంలో వేల ఎకరాల కబ్జాలు

## పదేళ్లలో దోచుకున్నారన్న బండి సంజయ్

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు లక్షల ఎకరాల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం ప్రజలకు సొంత భూమి లేదని, దాదాపు 25 లక్షల కుటుంబాలకు ఇంటి స్థలం కూడా లేదని చెప్పారు. ధరణి పేరుతో బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబం భూముల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని తాను గతంలోనే ప్రజలను హెచ్చరించానన్నారు. ఫామ్‌హౌస్ భూములపై మాట్లాడిన సమయంలో తనను తీవ్రంగా హెచ్చరించిన కేసీఆర్ వ్యాఖ్యలను కూడా బండి సంజయ్ గుర్తుచేశారు.

**వెయ్యి రోజులు ఎందుకు పట్టింది?**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు చెబుతున్న భూకబ్జాలను వెలుగులోకి తీసుకురావడానికి ప్రస్తుత ప్రభుత్వం వెయ్యి రోజులు ఎందుకు తీసుకుందని బండి సంజయ్ ప్రశ్నించారు. భూకబ్జాలపై గతంలో తాను చేసిన ఆరోపణలను ఇప్పుడు ప్రభుత్వం ప్రస్తావిస్తోందని అన్నారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్ మధ్య ఏదైనా రాజకీయ అవగాహన కుదిరిందా అని ప్రశ్నించారు. ప్రతి అసెంబ్లీ సమావేశంలో బీఆర్ఎస్‌కు రేవంత్‌రెడ్డి అవకాశాలు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను ఫామ్‌హౌస్ నుంచి బయటకు తీసుకొచ్చింది బీజేపీయేనని బండి సంజయ్ పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారానికి చేరువగా వచ్చి స్వల్ప తేడాతో అవకాశాన్ని కోల్పోయిందన్నారు. ఎవరు ఎవరిపై ఒత్తిడి తెచ్చారో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు.

**సిట్ దర్యాప్తులపై నిలదీత**

బీఆర్ఎస్‌లో పనిచేసిన సుమారు 90 మంది ఎమ్మెల్యేలు భూకబ్జాలకు పాల్పడ్డారని బండి సంజయ్ ఆరోపించారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ దర్యాప్తుల పురోగతిపై



ప్రశ్నలు సంధించారు. డ్రగ్స్ కేసు, ఈఫార్ములా వ్యవహారం, ఫోన్ ట్యాపింగ్, ఫామ్‌హౌస్ కేసుల దర్యాప్తు ఎక్కడికి చేరిందో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులపై ఏర్పాటు చేసిన సిట్ ప్రస్తుతం ఏం చేస్తోందో ప్రజలకు చెప్పాలని కోరారు. భూకబ్జాలపై ప్రభుత్వం నిజంగా చర్యలు తీసుకోవాలంటే ఆరోపణలకు మాత్రమే పరిమితం కాకుండా పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# పొత్తు ఊహాగానాలకు తెర



- బీజేపీతో పొత్తు ఉండదన్న కేటీఆర్

2028 ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందా? అని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఎలాంటి సందేహాలకు తావులేకుండా 'బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదు' అని సమాధానం ఇచ్చారు. దీంతో గత కొంతకాలంగా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న పొత్తు ఊహాగానాలకు కేటీఆర్ ప్రకటనతో స్పష్టత వచ్చింది.

**దామాషా పెంపునకే మద్దతు**

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా కేటీఆర్ తన వైఖరిని వెల్లడించారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను దామాషా ప్రాతిపదికన పెంచితే డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇవ్వడానికి అభ్యంతరం లేదని తెలిపారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ప్రాతినిధ్యం ఉందని పేర్కొన్నారు. మొత్తం స్థానాలను దామాషా ప్రకారం పెంచితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంపై ప్రభావాన్ని సమతుల్యం చేయవచ్చన్నది బీఆర్ఎస్ అభిప్రాయంగా వివరించారు. రాజకీయాలు, ప్రజా విధానాలు, డీలిమిటేషన్ అంశాలతో పాటు విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇచ్చారు.

**తెలంగాణ అభివృద్ధి నమూనా ప్రస్తావన**

తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరిస్తూ కేటీఆర్ సాగునీరు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కరవు ప్రభావిత ప్రాంతాలకు గోదావరి జలాలను తరలించే ఇంజినీరింగ్ పరిష్కారంగా అభివర్ణించారు. 201415లో సుమారు 44.4 లక్షల టన్నులుగా ఉన్న వరి ఉత్పత్తి 202324 నాటికి 168.8 లక్షల టన్నులకు పెరిగిందని తెలిపారు. టీహబ్, టీవర్క్స్, వీహబ్, టాస్క్ వంటి సంస్థల ద్వారా తెలంగాణలో ఇన్నోవేషన్, స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందిన తీరును వివరించారు. కృత్రిమ మేధపై స్పందిస్తూ కొత్త సాంకేతికతను భయపడకుండా స్వీకరించి ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

# భూములపై కవిత సంచలన సవాల్

## గజం అదనంగా ఉన్నా ప్రభుత్వానికే

అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించిన ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తానని సవాల్ చేశారు. తన కుటుంబంపై సీఎం చేసిన ఆరోపణలు అసత్యమని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని పేర్కొన్నారు. భూ వ్యవహారాల్లో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సీఎం ప్రస్తావించిన వ్యక్తుల భూములపైనా దర్యాప్తు జరపాలని కోరారు.

**అందరి భూములపై విచారణ కోరుతూ**

కేసీఆర్ ఫాంహౌస్ వ్యవహారంతో పాటు సీఎం ప్రస్తావించిన నవీన్‌రావు, కొండల్‌రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, ప్రతిమ శ్రీనివాస్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి తదితరుల భూములపై సమగ్ర విచారణ జరపాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ-గుంటనక్క'



కలిసే ఉన్నారని ఆమె వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక్క గజం భూమి ఉన్నా, అఫిడవిట్‌లో చూపించిన దానికంటే అదనపు భూమి ఉన్నా ప్రభుత్వానికి అప్పగిస్తానని మరోసారి స్పష్టం చేశారు. సీఎం ఆరోపణలకు కవిత సవాల్ జత కావడంతో తెలంగాణలో భూముల వివాదం రాజకీయంగా మరింత చర్చనీయాంశమైంది.

# ఆ భూముల లెక్క చెప్పండి

- భూపోరాటాల చరిత్ర కమ్యూనిస్టులదే
- 22ఏ భూములపై కూనంనేని డిమాండ్

22ఏ నిషేధిత భూములపై శాసనసభలో జరిగిన చర్చలో కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని, 1945 నుంచే భూమి కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారని గుర్తుచేశారు. భూపోరాటాల్లో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ శ్రేణులు సహా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కొమురం భీమ్ వంటి వారు భూమి కోసం పోరాడారని పేర్కొన్నారు. భూదాన్ ఉద్యమం ద్వారా లభించిన వేల ఎకరాల భూముల వివరాలను వెలికితీయాలని, భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. భూముల సమస్యను పూర్తిగా పరిష్కరించకపోతే వివాదాలు కొనసాగుతాయని అన్నారు.

**3 లక్షల ఎకరాలపై లెక్క తేల్చాలి**

ధరణి పోర్టల్‌లో జరిగిన తప్పిదాల వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని కూనంనేని ఆవేదన



వ్యక్తం చేశారు. ధరణి లోపాలతో ఇబ్బందులు ఎదుర్కొన్న సుమారు 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలను వెలికితీయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. నిజాం కాలంలో 'సర్ఫ్‌ఖాస్' పేరిట ఉన్న హైదరాబాద్ భూములు ఇప్పుడు ఎక్కడున్నాయో తేల్చాలని, వాటిని వెలికితీస్తే స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొచ్చని అన్నారు. చెరువులు, కుంటలు, అసైన్డ్ భూముల పరిస్థితిపైనా సమగ్ర పరిశీలన అవసరమన్నారు. 22ఏ అంశాన్ని సాంకేతిక తప్పిదంగా భావిస్తున్నప్పటికీ మంత్రులు, అధికారుల పాత్ర ఎంత ఉందో నిగ్గుతేల్చాలని కూనంనేని డిమాండ్ చేశారు.

# దానం అర్హతపై హైకోర్టు తీర్పు శుక్రవారం

## నాగేందర్ వ్యవహారంపై పొలిటికల్ రచ్చ

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై హైకోర్టు తీర్పు శుక్రవారానికి వాయిదా పడింది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, అనంతరం కాంగ్రెస్ బీ ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారని పేర్కొంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారించింది. దానం అనర్హతపై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేయడంతో హైకోర్టును ఆశ్రయించారు.

**బీ-ఫారంతో పోటీ కీలకమన్న పిటిషనర్లు**

పిటిషనర్ల తరఫు న్యాయవాదులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ కాంగ్రెస్ బీఫారంతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుకు స్పష్టమైన ఆధారమని వాదించారు. పార్టీ మార్పును నిర్ణయించేందుకు అసెంబ్లీలో



ఎమ్మెల్యే వ్యవహారాన్నే పరిగణనలోకి తీసుకోవాలన్న స్పీకర్ వైఖరిని వారు వ్యతిరేకించారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరిశీలనకు లోబడి ఉంటుందని పేర్కొన్నారు. దానం తరఫు న్యాయవాది ఈ వాదనలను ఖండించారు. దానం బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం తీసుకున్నట్లు ప్రకటించలేదని తెలిపారు. అసెంబ్లీ రికార్డుల్లో దానం ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని కోర్టుకు వివరించారు. వాదనలు పూర్తయిన నేపథ్యంలో ఈరోజు వెలువడాల్సిన తీర్పును ధర్మాసనం శుక్రవారానికి వాయిదా వేసింది.



# వినాయక నిమజ్జనంలో విషాదం

- చెరువులో మునిగి ఆరుగురి మృతి
- ఆస్పత్రికి తరలించినా దక్కని ప్రాణాలు

ప్రమాదం జరిగిన వెంటనే విద్యార్థులను పటాన్‌చెరులోని ప్రాచిన్ గ్లోబల్ ఆస్పత్రికి తరలించారు. అయితే వైద్యులు ఆరుగురూ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతులలో ఇద్దరు విజయవాడ, ఇద్దరు వరంగల్, మరో ఇద్దరు కూకట్‌పల్లికి చెందినవారిగా అధికారులు తెలిపారు. శిరీష మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అనాథ, నిరాశ్రయ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తోంది. అక్కడ మొదటి తరగతి నుంచి పాలిటెక్నిక్, బీటెక్ వరకు సుమారు 70 మంది విద్యార్థులు ఉంటున్నట్లు సమాచారం. గత 15 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో వినాయక నిమజ్జనం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వర్గాలు తెలిపాయి. ఘటనపై సమాచారం అందుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆస్పత్రిని సందర్శించారు. గురువారం ఉదయం 10 గంటల్లోపు పోస్టుమార్టం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు అంబులెన్స్‌లను సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# పీఎఫ్ పరిమితి పెంపు

- కోట్లాది ఉద్యోగులకు ఊరట
- రూ.15 వేల నుంచి రూ.25 వేలకు

ఈ నిర్ణయంతో అదనంగా 50 లక్షల నుంచి కోటి మంది ఉద్యోగులకు సామాజిక భద్రత ప్రయోజనాలు అందే అవకాశం ఉందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. కేంద్రం తాజా నిర్ణయానికి ప్రధానమంత్రి ఆమోదం లభించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ పథకానికి ప్రభుత్వంపై ఏటా సుమారు రూ.11,339 కోట్ల అదనపు వ్యయం పడుతుందని తెలిపారు.

**12 ఏళ్ల తర్వాత మరోసారి పెంపు**
**యజమానులపై అదనపు బాధ్యతలు**

పీఎఫ్ పరిమితి పెంపుతో ఉద్యోగులకు సామాజిక భద్రత విస్తరించనుండగా సంస్థలపై అదనపు బాధ్యతలు కూడా పెరగనున్నాయి. న్యాయ నిపుణురాలు దేబ్జానీ ఐచ్ ప్రకారం, రూ.25 వేల వరకు ప్రాథమిక వేతనం పొందే ఉద్యోగుల సంఖ్య పెరగడంతో యజమానులు వారి తరఫున 12 శాతం ఈపీఎఫ్ వాటా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మార్పు ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్), డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకం (ఈడీఎల్ఐ) పై కూడా ప్రభావం చూపనుంది. కొత్త పరిమితికి అనుగుణంగా హెచ్ఆర్, పేరోల్ వ్యవస్థలు, ఉద్యోగుల రికార్డులు, పీఎఫ్ దాఖలు ప్రక్రియలను సంస్థలు వేగంగా మార్చుకోవాల్సి ఉంటుంది. మొత్తంగా కేంద్ర నిర్ణయం తక్కువ వేతనాల పరిధిలో ఉన్న మరింత మంది ఉద్యోగులను దీర్ఘకాలిక పొదుపు, పెన్షన్, సామాజిక భద్రత వ్యవస్థలోకి తీసుకురానుంది.



## పన్ను వ్యవస్థలో సంస్కరణలకు నిర్మల పిలుపు



దేశ పన్ను వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, అవసరమైన సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ అన్నారు. బెంగళూరులో జరిగిన ఇంటర్నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ ఫౌండేషన్ 8వ అంతర్జాతీయ సదస్సులో ఆమె మాట్లాడారు. పన్ను నిబంధనల్లో మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాలను కాకుండా వ్యవస్థకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే విశ్లేషణాత్మక ప్రతిపాదనలను ముందుకు తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలతో కొందరికి ప్రయోజనం కలుగుతున్నా, అవి పన్ను వ్యవస్థ సమర్థతను దెబ్బతీస్తే వాటిని తొలగించేందుకు సూచనలు రావాలని అన్నారు. ఏదైనా నిబంధన పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం మోపితే ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం, ఖర్చు వృథా అవుతోంది అనే వివరాలను గణాంకాలతో సమర్పించాలని కోరారు. ప్రత్యామ్నాయ మార్గాలతో పాటు ప్రభుత్వ ఆదాయంపై ప్రభావాన్ని కూడా అంచనా వేయాలని సూచించారు. పన్ను పరిధిని విస్తరిస్తూనే విధానపరమైన అడ్డంకులను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నిర్మల తెలిపారు. మొత్తం ఆర్థిక వ్యవస్థకు మేలు చేసే మార్పులే నిజమైన సంస్కరణలని స్పష్టం చేశారు.

## సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ రెడ్ కార్పెట్

హైదరాబాద్‌ను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్, నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించేందుకు సిద్ధమైంది. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. చిప్ డిజైనింగ్, సెమీకండక్టర్ పరికరాలు, తయారీ పరిశ్రమలకు అనుమతులు, సబ్సిడీలు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు సింగపూర్ బృందం సుముఖత వ్యక్తం చేసింది. నెట్ జీరో కార్బన్ విధానంతో అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్ ఫ్రంట్ తొలిదశ పనులు, నైట్ ఎకానమీ ప్రణాళికలను సీఎం వివరించారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సూత్రప్రాయ అంగీకారం లభించిందన్నారు. భవిష్యత్ సాంకేతిక రంగంలో కీలకమైన సెమీకండక్టర్ పరిశ్రమను తెలంగాణలో విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. డిసెంబరులో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సింగపూర్ ప్రతినిధులను సీఎం అధికారికంగా ఆహ్వానించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు పాల్గొన్నారు.

## భార్య ముక్కు కొరికిన భర్త

- **కుటుంబ కలహాలతో హింసాకాండ**




తెలంగాణ మంచిర్యాల జిల్లా కొటపల్లి మండలంలో కుటుంబ కలహాలు తీవ్ర హింసకు దారితీశాయి. భార్యను తిరిగి ఇంటికి తీసుకెళ్లేందుకు వెళ్లిన భర్త మణిచందర్ ఆగ్రహంతో ఆమె ముక్కును కొరికి తీవ్రంగా గాయపరిచాడు. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ వివాదాల కారణంగా మమత పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో బుధవారం ఆమెను వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో వాగ్వాదం మొదలైంది. ఆగ్రహానికి గురైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేయడంతో పాటు, అడ్డుకునేందుకు ప్రయత్నించిన భార్యపై కూడా విచక్షణారహితంగా దాడి చేశాడు. అనంతరం ఆమె ముక్కును కొరకడంతో తీవ్ర గాయమైంది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కన్నడ సినీ గర్వానికి ఫాల్కే కిరీటం

### ఐదు దశాబ్దాల నటనకు అరుదైన గౌరవం



కన్నడ చిత్రసీమలో సీనియర్ నటుడు అనంత్ నాగ్ దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికయ్యారు. 1995లో డాక్టర్ రాజ్‌కుమార్ తర్వాత ఈ అత్యున్నత సినీ పురస్కారం అందుకోనున్న రెండో కన్నడ నటుడిగా అనంత్ నాగ్ నిలిచారు. 1948లో ఉత్తర కన్నడ జిల్లాలో జన్మించిన ఆయన అసలు పేరు అనంత్ నాగరకట్టే. 1973లో సంకల్ప చిత్రంతో కన్నడ సినీరంగ ప్రవేశం చేసిన ఆయన ఐదు దశాబ్దాలకు పైగా 300కుపైగా సినిమాల్లో నటించారు. వీటిలో 250కుపైగా చిత్రాలు కన్నడ భాషలోనే ఉన్నాయి. ప్రధాన స్రవంతి సినిమాలతో పాటు సమాంతర సినిమాల్లోనూ తనదైన నటనతో గుర్తింపు పొందారు. కన్నడ, మరాఠీ, హిందీ, కొంకణి నాటకాలతో రంగస్థల అనుభవం సంపాదించిన ఆయనకు ముంబయి థియేటర్ నేపథ్యం ఎంతో కీలకంగా నిలిచింది. కర్ణాటక ప్రభుత్వం నుంచి ఐదు రాష్ట్ర అవార్డులు, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ గౌరవం కూడా ఆయన అందుకున్నారు. గత ఏడాదే ఆయనకు పద్మభూషణ్ లభించింది.

### సెప్టెంబర్ 22న పురస్కార ప్రదానం

అనంత్ నాగ్‌కు 2024 సంవత్సరానికి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ప్రకటించినట్లు కేంద్రం తెలిపింది. భారతీయ సినిమాకు ఆయన చేసిన విశిష్ట సేవలు, తరాలను ప్రభావితం చేసిన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందిస్తున్నట్లు పీఐబీ వెల్లడించింది. సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని కేవడియాలో జరిగే 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించనున్నారు. ఈ గౌరవాన్ని కన్నడిగులకు, కర్ణాటకకు అంకితం చేస్తున్నట్లు అనంత్ నాగ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయన సహజ నటన, వైవిధ్యం, కళాత్మక ప్రతిభను ప్రశంసించారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా అభినందనలు తెలిపారు. కర్ణాటకకు చెందిన సినిమాటోగ్రాఫర్ వీకే మూర్తికి 2008లో ఫాల్కే అవార్డు లభించినా, అది హిందీ సినిమాకు చేసిన సేవలకు దక్కింది. అందువల్ల కన్నడ సినిమాకు నేరుగా దక్కిన రెండో ఫాల్కే గౌరవంగా అనంత్ నాగ్ పురస్కారం నిలిచింది.

## సౌదీపై హూతీల దాడులు ఎఫ్15 కూల్చివేత ప్రకటన

పశ్చిమాసియాలో సౌదీ అరేబియా-హూతీల మధ్య పోరు మరింత ఉధృతమైంది. యెమెన్ ప్రభుత్వానికి సౌదీ మద్దతు ఇస్తుండటంతో హూతీలు వరుస ఎదురుదాడులకు దిగుతున్నారు. ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్‌మాండెబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించిన హూతీలు, తాజాగా సౌదీలోని పవిత్ర నగరం మక్కా వైపు డ్రోన్లు ప్రయోగించినట్లు సమాచారం. సౌదీ బలగాలు వాటిని అడ్డుకుని మక్కాలో అప్రమత్తత ప్రకటించాయి. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే యెమెన్‌లోని మారిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ ఎఫ్15 యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు హూతీ సైనిక దళాలు ప్రకటించాయి. స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఉపరితలం నుంచి గగనతలంలోకి దూసుకెళ్లే క్షిపణితో విమానాన్ని కూల్చినట్లు హూతీ ప్రతినిధి యాహ్యా సారీ వెల్లడించారు. అమెరికా నుంచి పొందిన ఎఫ్15ను కూల్చినట్లు వచ్చిన ప్రకటన పశ్చిమాసియాలో కలకలం రేపింది. అయితే ఈ వాదనను సౌదీ ప్రభుత్వం ఇప్పటివరకు ధృవీకరించలేదు. మక్కా భద్రత విషయంలో రాజీపడబోమని సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరించగా, పవిత్ర ఇస్లామిక్ స్థలాలకు హాని చేయడం తమ ఉద్దేశం కాదని హూతీలు స్పష్టం చేశారు.

# యూపీఐ చార్జీల అసలు లెక్క

- **అక్టోబర్ 15 నుంచి కొత్త రుసుములు**
- **యూపీఐపై రుసుము ఎవరు చెల్లించాలి?**



అక్టోబర్ 15, 2026 నుంచి కొన్ని వ్యాపార లావాదేవీలకు యూపీఐపై 0.4 శాతం వ్యాపారి రుసుము అమల్లోకి రానుంది. అయితే ఈ రుసుము వినియోగదారుడిపై నేరుగా పడదు. రూ.2,000కు మించిన నిర్దిష్ట వ్యాపార చెల్లింపులకు ఈ రుసుము వర్తిస్తుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300కే పరిమితం చేశారు. ఉదాహరణకు రూ.3,000 చెల్లింపుపై రూ.12, రూ.50,000 చెల్లింపుపై రూ.200 రుసుము ఉంటుంది. వినియోగదారుడి బ్యాంకు ఖాతా నుంచి ఈ రుసుము పేరుతో అదనపు మొత్తం కట్ కాదు.

### చిన్న వ్యాపారులకు కొనసాగనున్న మినహాయింపు

నెలకు యూపీఐ ద్వారా రూ.1 లక్ష వరకు స్వీకరించే చిన్న వ్యాపారులకు రుసుము ఉండదు. దీంతో చిన్న దుకాణాలు, వీధి వ్యాపారులు, సూక్ష్మ వ్యాపారాలపై కొత్త విధానం ప్రభావం పరిమితంగానే ఉండనుంది. ఒక వ్యక్తి మరో వ్యక్తికి చేసే యూపీఐ చెల్లింపులు కూడా ఉచితంగానే కొనసాగుతాయి. కుటుంబ సభ్యులకు డబ్బు పంపడం, స్నేహితుడికి బిల్లు వాటా చెల్లించడం, సొంత బ్యాంకు ఖాతాల మధ్య నగదు బదిలీ చేయడంపై కొత్త రుసుము వర్తించదు. రూ.2,000 వరకు చేసే సాధారణ వ్యాపార చెల్లింపులు కూడా ఈ రుసుము పరిధిలోకి రావు.

### కస్టమర్‌పై అదనపు భారం పడుతుందా?

కొత్త నిబంధనల ప్రకారం వ్యాపారి రుసుమును నేరుగా వినియోగదారుల నుంచి వసూలు చేయకుండా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంటే రూ.5,000 విలువైన వస్తువు కొనుగోలు చేసి యూపీఐ ద్వారా చెల్లిస్తే అదనంగా రుసుము చెల్లించాల్సిన అవసరం ఉండదు. యూపీఐ స్వయంచాలక చెల్లింపులు, క్రమం తప్పని పెట్టుబడులు, వినోద ప్రసార చందాలు వంటి పునరావృత చెల్లింపులకు ఈ రుసుము వర్తించదు. రైల్వే, దూరసంప్రదింపులు, బీమా, ఇంధనం వంటి కొన్ని రంగాలకు రూ.5 స్థిర రుసుము విధానం ఉంటుంది. నిర్దిష్ట పెట్టుబడి మార్కెట్ లావాదేవీలకు 0.02 శాతం రుసుము, రూ.300 పరిమితి ఉంటుంది.

### అసలు మార్పు ఎక్కడ జరుగుతుంది?

యూపీఐ వినియోగం భారీగా పెరిగిన నేపథ్యంలో దాని సాంకేతిక వ్యవస్థ నిర్వహణ, సైబర్ భద్రత, మోసాల నియంత్రణ, చెల్లింపుల మౌలిక వసతుల నిర్వహణకు అయ్యే ఖర్చులను భరించేందుకు ఈ రుసుము విధానం తీసుకొచ్చినట్లు వివరణలు ఉన్నాయి. అయితే చిన్న వ్యాపారులపై అదనపు ఖర్చు పడితే డిజిటల్ చెల్లింపుల కంటే నగదు లావాదేవీల వైపు మళ్లే అవకాశం ఉందన్న ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. నా దేశం పరిశోధనలో కీలకంగా తేలిన విషయం: అక్టోబర్ 15 నుంచి ప్రతి యూపీఐ చెల్లింపుపైనా రుసుము ఉండదు. ప్రధాన మార్పు వ్యాపారి వైపు అమలయ్యే రుసుము విధానంలోనే.

# యూపీఐ చార్జీలపై తగ్గేదేలేదు

- **యూపీఐ చార్జీలపై తగ్గేదేలేదు**
- **2 వేలు దాటితే 0.4% రుసుము**
- **అక్టోబర్ 15 నుంచి కొత్త విధానం**
- **తేల్చి చెబుతున్న కేంద్ర పెద్దలు**



యూపీఐ ద్వారా రూ.2,000కు మించిన నిర్దిష్ట వ్యాపారి చెల్లింపులపై విధించనున్న 0.4 శాతం వ్యాపారి రుసుము విషయంలో కేంద్రం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అక్టోబర్ 15 నుంచి కొత్త రుసుము విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. ఈ నిర్ణయం యూపీఐ వ్యవస్థను దీర్ఘకాలంలో మరింత బలోపేతం చేయడం, భద్రతను పెంచడం, సాంకేతిక మౌలిక వసతులను మెరుగుపరచడం లక్ష్యంగా తీసుకున్నదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. యూపీఐ వ్యవస్థను స్వయం సమృద్ధిగా మార్చడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నాయి. ఈ నిర్ణయంపై వ్యాపారులు, దుకాణదారులు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్రం తాజా స్పష్టత ఇచ్చింది.

### 2020లోనే నిర్ణయం తీసుకున్నాం

ప్రభుత్వ వర్గాల ప్రకారం యూపీఐ వ్యవస్థ ప్రారంభమైన సమయంలోనే భవిష్యత్తులో వ్యాపారి రుసుము విధించే అంశంపై నిర్ణయం తీసుకున్నారు. ఇతర దేశాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న శూన్య రుసుము విధానం వల్ల ప్రభుత్వ ఆర్థిక వనరులపై భారం పడుతోందని పార్లమెంటరీ ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం కూడా గతంలో పేర్కొంది. యూపీఐ వ్యవస్థ దీర్ఘకాలికంగా నిలదొక్కుకోవాలంటే స్థిరమైన ఆదాయ విధానం అవసరమని కమిటీ సూచించింది. శూన్య రుసుము విధానాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం ఏటా సుమారు రూ.2,000 కోట్లు ప్రోత్సాహకంగా ఖర్చు చేస్తోందని కూడా నివేదికలో ప్రస్తావించింది.

# వచ్చే వారం వానలే వానలు

- **బంగాళాఖాతంలో మరో అల్పపీడనం**



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సెప్టెంబర్ 19 సాయంత్రానికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అనంతరం ఇది 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. తర్వాత దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశముందని అంచనా వేసింది. దీని ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని అధికారులు సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

### రేపటి నుంచి మరిన్ని ప్రాంతాలకు వర్షా లు

ప్రస్తుత ఉపరితల ఆవర్తనం దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమపై సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. కర్ణాటక, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ద్రోణి విస్తరించింది. రేపు అల్లూరి, పోలవరం, కృష్ణా, గుంటూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటికే కాకినాడ రౌతులపూడిలో 68.6 మి.మీ., అనకాపల్లి మర్రిపాలెంలో 54 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈదురుగాలులతో వర్షాలు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

## లడ్డూ వేలం.. ఇంట్లో విషాదం



నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం ఎర్రమఠంలో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన ఓ ఘటన కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గ్రామంలో నిర్వహించిన వినాయక లడ్డూ వేలంలో మద్దిలేటి అనే వ్యక్తి రూ.38 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. లడ్డూను ఇంటికి తీసుకెళ్లిన తర్వాత వేలంలో ఎక్కువ మొత్తానికి పాట పాడటంపై కుటుంబంలో చర్చ మొదలైనట్లు స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపారు. ఈ విషయం క్రమంగా వివాదంగా మారడంతో మద్దిలేటి తీవ్రంగా కలత చెందినట్లు చెప్పారు. మాటామాటా పెరగడంతో ఆయన మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. దీంతో వినాయక నిమజ్జన వేళ పండుగ వాతావరణంలో ఒక్కసారిగా విషాదం నెలకొంది. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

### కుటుంబాన్ని కలిచివేసిన ఘటన

ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కేసు నమోదు చేసి ఘటనకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు ప్రారంభించారు. లడ్డూ వేలం తర్వాత కుటుంబంలో ఏం జరిగింది, వివాదం ఏ విధంగా చోటుచేసుకుంది అనే అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పండుగ సందర్భంగా ఆనందంగా జరగాల్సిన కార్యక్రమం ఇలా విషాదంగా మారడంతో గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఒక చిన్న కుటుంబ వివాదం తీవ్ర పరిణామానికి దారితీయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మద్దిలేటి మృతితో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

## జనం నెత్తిన యూపీఐ పన్ను

- **ట్రంప్ ఒత్తిడికి మోదీ తలొగ్గారు**
- **చార్జీల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి**
- **కొత్త చార్జీలపై రాహుల్ గాంధీ ఫైర్**



యూపీఐ లావాదేవీలపై కొత్తగా విధించిన వ్యాపారి రుసుముపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడికి తలొగ్గారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. "యూపీఐపై విధించిన రుసుమును వెంటనే వెనక్కి తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. అమెరికా ఒత్తిడికి లొంగిపోయి భారతీయులపై 'యూపీఐ పన్ను' విధిస్తున్నారని విమర్శించారు. అమెరికా కంపెనీలకు ప్రయోజనం కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారన్నది కాంగ్రెస్ ప్రధాన ఆరోపణగా ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇది వినియోగదారులపై విధించే పన్ను కాదని స్పష్టం చేసింది.

### అమెరికా ఒత్తిడే కారణమా?

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా యూపీఐపై శూన్య వ్యాపారి రుసుము విధానాన్ని అమెరికా గతంలో ప్రశ్నించిందని ప్రస్తావించారు. వీసా, మాస్టర్‌కార్డ్ వంటి కార్డు సంస్థలతో పోలిస్తే యూపీఐ ఉచితంగా ఉండటంపై అమెరికా వాణిజ్య ప్రతినిధి అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. 0.4 శాతం రుసుమును ఎందుకు నిర్ణయించారో, దీని వెనుక అమెరికా కార్డు సంస్థలకు పోటీ అవకాశం కల్పించే ఉద్దేశం ఉందా అని కాంగ్రెస్ ప్రశ్నించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా అమెరికా సుంకాలు, వాణిజ్యం, వీసాలు, డిజిటల్ చెల్లింపుల విషయంలో భారత్‌పై ఒత్తిడి పెరుగుతోందని విమర్శించారు.

## యూపీఐ చార్జీలతో మళ్లీ నగదు ?

- **వ్యాపారుల ఆందోళనతో కొత్త చర్చ**
- **చిన్న వ్యాపారాలపై ప్రభావంపై హెచ్చరిక**

అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొన్ని యూపీఐ వ్యాపార లావాదేవీలపై 0.4 శాతం వ్యాపారి రుసుము అమల్లోకి రానుండటంపై రిటైలర్ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. చిన్న వ్యాపారులు ఇక యూపీఐ తీసుకోవాలా, నగదు తీసుకోవాలా అని ఆలోచించాల్సిన పరిస్థితి రావచ్చని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యనిర్వహణాధికారి కుమార్ రాజగోపాలన్ అన్నారు. తక్కువ లాభాలతో పనిచేసే చిన్న దుకాణాలకు స్వల్ప రుసుము కూడా ప్రభావం చూపుతుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన విధానానికి ఈ మార్పు విరుద్ధంగా మారే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### పండుగ సీజన్‌లోనే కొత్త రుసుము

వస్త్ర తయారీదారుల సంఘం అధ్యక్షుడు సంతోష్ కటారియా కూడా నిర్ణయం అమలయ్యే సమయంపై ప్రశ్నలు లేవనెత్తారు. అక్టోబర్ 15 నుంచి రుసుము అమల్లోకి రావడం, దీపావళి విక్రయాల సీజన్‌కు కొద్ది వారాల ముందే కావడం వ్యాపారులకు అదనపు ఒత్తిడిగా మారొచ్చని అన్నారు. ఢిల్లీలోని కమలా నగర్ మార్కెట్ వ్యాపారుల ప్రతినిధులు కూడా యూపీఐపై రుసుము పడితే నగదు చెల్లింపులను ప్రోత్సహించే పరిస్థితి రావచ్చని పేర్కొన్నారు. రిటైలర్ల సంఘం ఈ అంశంపై జాతీయ చెల్లింపుల సంస్థ, ఆర్థిక మంత్రిత్వ శాఖతో చర్చించి, లావాదేవీ రకాన్ని బట్టి దశలవారీ రుసుము విధానం తీసుకురావాలని కోరనుంది.

## పోలీస్ ఉద్యోగాలకు భారీ నోటిఫికేషన్

- **2,050 పోస్టులతో నియామక ప్రకటన**

ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగులకు భారీ ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సెప్టెంబర్ 16న 2,050 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. పోలీస్, ఫైర్, జైళ్లు, ఫోరెన్సిక్ విభాగాల్లో ఎస్ఐ, కానిస్టేబుల్, ఫైర్‌మెన్, వార్డర్, డ్రైవర్ తదితర పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో 378 ఎస్ఐ పోస్టులు, 1,156 కానిస్టేబుల్ పోస్టులు ఉన్నట్లు సమాచారం. ఎస్ఐ (SPF), ఎస్ఐ కమ్యూనికేషన్, ఎస్ఐ PTO, సైంటిఫిక్ అసిస్టెంట్, సివిల్/AR కానిస్టేబుల్, ఫైర్‌మెన్, జైలు వార్డర్, కమ్యూనికేషన్ కానిస్టేబుల్, మెకానిక్/డ్రైవర్ పోస్టులు నోటిఫికేషన్‌లో ఉన్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు, ప్రిలిమినరీ రాత పరీక్ష తేదీలను బోర్డు త్వరలో ప్రకటించనుంది. పోస్టుల వారీగా విద్యార్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, ఎంపిక విధానాన్ని అభ్యర్థులు పరిశీలించాలి.

### అధికారిక వెబ్‌సైట్‌లోనే దరఖాస్తులు

పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు అధికారిక ప్రకటన విడుదలైన తర్వాత నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. APSLPRB అధికారిక వెబ్‌సైట్ slprb.ap.gov.in ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇతర శాఖల్లోనూ నియామక ప్రక్రియను కొనసాగిస్తోంది. ఏపీపీఎస్సీ ద్వారా 892 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇప్పటికే విడుదలయ్యాయి. వీటిలో గ్రూప్ 1కు 163 పోస్టులు, ఇతర విభాగాలకు 729 పోస్టులు ఉన్నాయి. సాధారణ అభ్యర్థుల వయోపరిమితిని కూడా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నాన్ యూనిఫామ్ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లకు, యూనిఫామ్ సర్వీసుల ప్రత్యక్ష నియామకాలకు కూడా మరో రెండేళ్లు పెంచారు. ఈ సడలింపు వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉండనుంది.

రాజ్య సంస్కరణ

గురువారం, 17.9.2026, మేడ్చల్ మల్కాజిగిరి

# పేదల వైద్యానికి సీఎం భరోసా



**46 మందికి 35.24 లక్షల చెక్కుల పంపిణీ**

**ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి హర్షం**

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పేదల వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం 31వ విడత సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను 46 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూ.35.24 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,401 మందికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. 31 విడతల్లో కలిపి సుమారు రూ.12.22 కోట్ల మేర చెక్కులను పేదలకు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు ఆర్థిక సాయం అందించడంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రొద్దుటూరు నియోజకవర్గం రెండో, మూడో స్థానాల్లో కొనసాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని వరదరాజుల రెడ్డి చెప్పారు. ముఖ్యంగా ఖరీదైన వైద్య చికిత్సలు అవసరమైన కుటుంబాలకు ఈ సాయం ఆర్థికంగా ఊరట కలిగిస్తోందని పేర్కొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజం



**వేంపల్లెలో ఘనంగా పోషణ్ మాసం వేడుకలు**

వేంపల్లె మండలం గాండ్ల వీధి అంగన్‌వాడీ కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 9వ పోషణ్ మాసం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ డాక్టర్ స్వర్ణలత పోలం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార పరిరక్షణ లక్ష్యంగా ప్రతి ఏడాది సెప్టెంబర్‌లో పోషణ్ మాసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు, పండ్లతో కూడిన సమతుల్యాహారం తీసుకోవాలని సూచించారు. గర్భం నుంచి రెండేళ్ల వయస్సు వరకు తొలి 1000 రోజులు శారీరక, మానసిక ఎదుగుదలకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు తీసుకోవడంతోపాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోషకాహార పదార్థాలు, ఆకుకూరలతో పోషణ్ మేళా ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆయా, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

# యువతలో నాయకత్వ లక్షణాలే దేశానికి బలం



**భవిష్యత్ భరోసాతో అడుగులేయాలని పిలుపు**

కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో యువతకు భరోసా, సమర్థత, నాయకత్వం, ప్రకాశవంతమైన భవిష్యత్తు లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలతో ముందుకొచ్చే యువత కోసం స్టార్టప్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యతోపాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని సమాజ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, గ్రూప్ 1 నియామక నోటిఫికేషన్ ఇందుకు ఉదాహరణలని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి యువత భరోసా, సమర్థత, నాయకత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. వైస్ ఛాన్సలర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, టీడీపీ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సర్కారీ బడులకు కార్పొరేట్ హంగులు



నెల్లూరులో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే దిశగా మరో ముందడుగు పడింది. సీఎస్ఆర్ నిధులతో ఆధునికీకరించిన రెండు ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం ప్రారంభించారు. స్టోన్ హౌస్ పేటలో వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్లతో అభివృద్ధి చేసిన ఆర్ ఎస్ ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ లో 43 తరగతి గదులు, డిజిటల్ ఎల్ ఈడీ స్క్రీన్లు, కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, సైన్స్ ల్యాబ్ లు ఏర్పాటు చేశారు. ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్ లతో పాటు ఎకరం విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణం, సింథటిక్ కోర్టు, అవుట్ డోర్ జిమ్ అందుబాటులోకి తెచ్చారు. అనంతరం మూలపేటలో రూ.13.4 కోట్లతో ఆధునికీకరించిన డీఎస్ ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కూడా మంత్రి ప్రారంభించారు. అయితే భవనాలు నిర్మించడం మాత్రమే కాదు.. విద్యా ప్రమాణాలు, ఫలితాలు పెరగాలని లోకేశ్ స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో 60.19 శాతం ఉత్తీర్ణతపై అసంతృప్తి వ్యక్తం చేసి, విద్యార్థుల హాజరు, ఎన్ రోల్ మెంట్ తగ్గడానికి కారణాలు తెలుసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీగా ఫలితాలు మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు.

# మోపిదేవి శ్రీనివాసరావుపై వైసీపీ సస్పెన్షన్



రేపల్లె నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత మోపిదేవి శ్రీనివాసరావును వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్నారు. కేవలం ఐదు నెలల క్రితం కాంగ్రెస్‌ను వీడి, మేలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన శ్రీనివాసరావుపై ఇంత త్వరగా వేటు పడటం బాపట్ల జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేపల్లె నుంచి పోటీ చేసిన ఆయన ఓటమిపాలయ్యారు. వైసీపీలో చేరిన తర్వాత స్థానిక పార్టీలో సమాంతర గ్రూపు రాజకీయాలను నడుపుతున్నారనే ఆరోపణలు ఆయనపై వచ్చాయి. రాబోయే ఎన్నికల్లో రేపల్లె ఎమ్మెల్యే టికెట్ తనకే ఖరారైందంటూ నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటున్నారని స్థానిక పార్టీ కేడర్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై అధిష్ఠానం చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. వర్గపోరును ప్రోత్సహించే నేతలను ఉపేక్షించకూడదనే ఉద్దేశంతోనే సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తాజా పరిణామం రేపల్లె వైసీపీలో అంతర్గత రాజకీయాలపై కొత్త చర్చకు దారితీసింది.

# ధరలకు కళ్లెం

**మార్కెట్ జోక్యంతో ధరల నియంత్రణ**

**పంటలకు ముందస్తు అంచనా: సీఎం**

నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ శాఖలపై నిర్వహించిన సమీక్షలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు పంటల సాగు, ఉత్పత్తి, డిమాండ్, సరఫరాను ముందుగానే అంచనా వేయాలని సూచించారు. ధరలు పెరిగే అవకాశమున్న పంటలను గుర్తించి అవసరమైన చోట మార్కెట్ ఇంటర్వెన్షన్ చేపట్టాలని చెప్పారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలను రాష్ట్రంలో అమలు చేయడంతో పాటు రైతులను ఆయా పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. అవసరమైతే బైబ్యాక్ ఒప్పందాలు చేసుకోవాలని, ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్, రైతు బజార్లు, రేషన్ .డిపోలను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. ఉల్లి, కందిపప్పు, పామాయిల్ వంటి నిత్యావసరాలను రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా అందుబాటులోకి తేవాలని చెప్పారు.హైరిస్క్ పంటలకు రూ.190 కోట్లు రాష్ట్రంలో సాగు చేయని 8.61 లక్షల హెక్టార్లలో వర్షాధార పంటలు సాగు చేయించాలని సీఎం సూచించారు. చిరుధాన్యాలు, రాగి, కొర్రలు, జొన్న, సజ్జ, మొక్కజొన్న, ఉలవల సాగుపై దృష్టి పెట్టాలని చెప్పారు. నేచురల్ ఫార్మింగ్ ను ప్రోత్సహించాలని ఆదేశించారు. ప్రస్తుతం 3.61 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు హైరిస్క్ లో ఉన్నందున వాటి రక్షణకు రూ.190 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ లో భాగంగా అవసరమైన చోట వాటర్ ట్యాంకర్లను పంపించాలని సూచించారు. పశుగ్రాసం కొరతతో పాల ఉత్పత్తి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావంపై తీసుకుంటున్న చర్యలను ప్రతి నెలా కేంద్రానికి తెలియజేయాలని సూచించారు.




# క్యూలోనే ఆధ్యాత్మిక అనుభూతి

**పిలిగ్రిమ్స్ ఎక్స్‌పిరియన్స్ కేంద్రం ప్రారంభం**

తిరుమలలో భక్తుల దర్శన నిరీక్షణ సమయాన్ని మరింత ఆధ్యాత్మికంగా మార్చే దిశగా టీటీడీ కొత్త కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలిగ్రిమ్స్ ఎక్స్ పీరియన్స్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని ప్రశాంతమైన అనుభూతిగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. సాధారణంగా దర్శనం కోసం గంటల తరబడి క్యూలో వేచి ఉండే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందించనున్నారు. భక్తుల్లో ప్రశాంతత, భక్తిభావాన్ని పెంచేలా హీలింగ్, డివోషన్ ఎక్స్ పీరియన్స్ కేంద్రాన్ని టీటీడీ ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో ఏర్పాటు చేసిన ఇమ్మెర్సివ్ థియేటర్ ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక దృశ్య అనుభూతి కల్పించనున్నారు. లైవ్ మెడిటేషన్ ప్రసారం కూడా అందుబాటులో ఉంటుంది. దీంతో క్యూలో వేచి ఉండే సమయం నిరీక్షణగా కాకుండా ధ్యానం, ఆధ్యాత్మిక చింతనకు ఉపయోగపడేలా మారనుంది.

# 2 వేలకుపైగా యూపీఐపై పిటిషన్

**సుప్రీంను ఆశ్రయించిన న్యాయవాది**

రూ.2,000కు మించిన కొన్ని యూపీఐ వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది అంజన్ దత్తా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. కేంద్రం సెప్టెంబర్ 14న జారీ చేసిన నోటిఫికేషన్, సెప్టెంబర్ 15న ప్రకటించిన ఎండీఆర్ విధానాన్ని ఆయన సవాల్ చేశారు. కొత్త విధానం ప్రకారం అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన నిర్దిష్ట పర్సన్‌టుమర్చంట్ యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం రుసుము అమల్లోకి రానుంది. రూ.75,000కు పైబడిన లావాదేవీలకు ఒక్కో లావాదేవీపై గరిష్ఠంగా రూ.300కు పరిమితం చేశారు.

**చిన్న లావాదేవీలకు మినహాయింపులు**

పిటిషన్‌లో రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులు, వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే బదిలీలు ఉచితంగానే కొనసాగుతాయని పేర్కొన్నారు. నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా మినహాయింపు ఉంటుందని పిటిషనర్ వివరించారు. అయితే పేమెంట్ వ్యవస్థల చట్టం2007లోని సవరించిన సెక్షన్ 10A రాజ్యాంగబద్ధతపై పిటిషన్ ప్రశ్నలు లేవనెత్తింది. ఎలాంటి ఎలక్ట్రానిక్ చెల్లింపు విధానాలకు ఛార్జీల నుంచి రక్షణ ఇవ్వాలనే విషయంలో కేంద్ర కార్యనిర్వాహక వ్యవస్థకు స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా అధికారం కల్పించారని వాదించింది.

**పారదర్శకతపై సుప్రీంకోర్టులో ప్రశ్నలు**

ఎండీఆర్ రేట్లు, లావాదేవీ పరిమితులు వంటి కీలక అంశాలను కేవలం ప్రెస్ రిలీజ్ ద్వారా ప్రకటించడాన్ని కూడా పిటిషన్ ప్రశ్నించింది. ఛార్జీలను నిర్దేశించే పూర్తి అమలు పత్రాన్ని అధికారిక గెజిట్‌లో ప్రచురించలేదని ఆరోపించింది. ఎండీఆర్ విధానంపై విస్తృత, పారదర్శక సంప్రదింపులు నిర్వహించాలని, అందుకు సంబంధించిన గణాంకాలు, ప్రభావ అంచనా నివేదికను బహిర్గతం చేయాలని కోరింది. సూక్ష్మ, చిన్న సంస్థలపై భారం పడకుండా ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని కూడా పిటిషన్‌లో విజ్ఞప్తి చేసింది.

# 2 వేల యూపీఐ పరిమితి కలకలం

**సామాన్యుడిపై భారం పడదంటున్నా సందేహాలు**



అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొన్ని యూపీఐ పర్సన్‌టుమర్చంట్ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ అమల్లోకి రానుండటంతో సామాన్య వినియోగదారుల్లో కొత్త సందేహాలు మొదలయ్యాయి. ఈ రుసుమును నేరుగా వినియోగదారుడి నుంచి వసూలు చేయబోమని కేంద్రం చెబుతున్నా, వ్యాపారులపై పడే ఖర్చు చివరకు ధరల రూపంలో వినియోగదారుడిపై ప్రభావం చూపుతుందా అన్న ప్రశ్నలు ఉన్నాయి. మరోవైపు రూ.2,000 వరకు లావాదేవీలు ఉచితం కావడంతో చాలామంది వినియోగదారులు పెద్ద మొత్తాన్ని ఒకేసారి చెల్లించకుండా రూ.2,000లోపు చిన్నచిన్న లావాదేవీలుగా విభజించే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. ఉదాహరణకు రూ.6,000 చెల్లించాల్సిన వ్యక్తి మూడు విడతల్లో చెల్లిస్తే ఆ లావాదేవీలపై ఎండీఆర్ వర్తిస్తుందా అన్నది వినియోగదారులకు స్పష్టంగా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం వెల్లడైన వివరాల ప్రకారం ఈ రుసుము వ్యాపారుల చెల్లింపులపై వర్తించే విధానంగా పేర్కొంటున్నారు.

**చిన్న వ్యాపారులపై ప్రభావమెంత?**

యూపీఐపై ఆధారపడే చిన్న దుకాణాలు, కిరాణా వ్యాపారులు, రెస్టారెంట్లు, ఇతర సూక్ష్మ వ్యాపారాలకు ఎండీఆర్ కొత్త ఖర్చుగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వం మాత్రం బ్యాంకులు ఎండీఆర్ భారాన్ని వినియోగదారులపై మోపకుండా వ్యాపారులు పాటించేలా చూడాలని సూచించింది. అయినా వ్యాపారులు తమ ఖర్చులను ఎలా నిర్వహిస్తారు? వస్తువుల ధరలు పెంచుతారా? డిజిటల్ చెల్లింపులపై ఆంక్షలు పెడతారా? వంటి ప్రశ్నలు సామాన్యుడిలో సహజంగానే తలెత్తుతున్నాయి.

**అసలు ఎవరికి ప్రయోజనం?**

ఎండీఆర్ ద్వారా యూపీఐ చెల్లింపు వ్యవస్థలోని బ్యాంకులు, పేమెంట్ ప్రాసెసర్లు, ప్లాట్‌ఫారమ్‌లకు ఆదాయ మార్గం ఏర్పడుతుంది. యూపీఐ ప్రస్తుతం భారీ స్థాయిలో ఉపయోగంలో ఉంది. 2026 ఆగస్టులోనే యూపీఐ ద్వారా 24,508.96 మిలియన్ లావాదేవీలు, రూ.29.82 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు నమోదయ్యాయి. ఇంత విస్తృతమైన వ్యవస్థలో చిన్న శాతం రుసుము కూడా పెద్ద మొత్తంగా మారే అవకాశం ఉంది.

**స్పష్టత ఎప్పుడు వస్తుంది?**

ఇక్కడే ప్రధాన ప్రశ్న అసలు ఎండీఆర్ ఎలా అమలవుతుంది? రూ.2,000 పరిమితిని వినియోగదారులు ఎలా ఎదుర్కొంటారు? ఒకే కొనుగోలును విడగొట్టి చెల్లిస్తే ఏం జరుగుతుంది? వ్యాపారి వినియోగదారుడిపై పరోక్షంగా భారం మోపితే ఎలా నియంత్రిస్తారు? చిన్న వ్యాపారులకు రక్షణ ఏంటి? వంటి అంశాలపై మరింత స్పష్టత అవసరం. ఎండీఆర్ విధానంపై పారదర్శకత, ప్రభావ అంచనా, చిన్న వ్యాపారాలకు రక్షణ చర్యలు కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలైంది. యూపీఐ చెల్లింపుల భవిష్యత్తును ప్రభావితం చేసే ఈ మార్పులపై సామాన్యుడికి పూర్తి స్పష్టత ఎప్పుడు వస్తుందన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న.

## టౌన్ బ్యాంకులో 11.50 లక్షల వ్యవహారం

**సమగ్ర విచారణ జరపాలని రాచమల్లు డిమాండ్**



ప్రొద్దుటూరు టౌన్ బ్యాంకులో ఇన్సూరెన్స్ సొమ్ము డ్రా చేసిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. బొందలకుంట సుబ్బరాయుడి కుమార్తె సుచరితకు రావాల్సిన ఇన్సూరెన్స్ సొమ్ములో సుమారు రూ.11.50 లక్షలను ఆమెకు తెలియకుండా తప్పుడు పత్రాలు, సంతకాలతో మరో వ్యక్తి డ్రా చేసినట్లు ఆయన ఆరోపించారు. సుచరిత ఆధార్, పాన్ కార్డులతో ఖాతా తెరిచి, మరో యువతి ఫొటో, సంతకాలతో లావాదేవీలు నిర్వహించినట్లు తెలిపారు. గత మార్చి 9న రూ.9 లక్షలు, మరుసటి రోజు రూ.2.51 లక్షలు ఉపసంహరించినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసు కేసు నమోదు చేసి, జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని కోరారు. బ్యాంకులో ఇలాంటి లావాదేవీలు ఇంకా ఎన్ని జరిగాయో వెలుగులోకి తేవాలని అన్నారు. సంబంధిత మొత్తాన్ని తిరిగి బ్యాంకులో జమ చేసినట్లు తనకు సమాచారం ఉందన్నారు. అధికారులు స్పందించకపోతే తానే పోలీసులకు ఫిర్యాదు చేసి న్యాయపోరాటం చేస్తానని రాచమల్లు స్పష్టం చేశారు.

## హోటళ్లలో బలవంతపు సర్వీస్ ఛార్జీకి చెక్

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టీకరణ**



స్పష్టీకరణ కడపలో హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లలో వినియోగదారుల నుంచి బలవంతంగా సర్వీస్ ఛార్జీ వసూలు చేయరాదని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ 2022 జూలై 4న జారీ చేసిన మార్గదర్శకాలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బిల్లులో ముందుగానే సర్వీస్ ఛార్జీని కలిపి తప్పనిసరిగా వసూలు చేయరాదని, వినియోగదారుడు స్వచ్ఛందంగా చెల్లిస్తే మాత్రమే తీసుకోవాలని తెలిపారు. 'సిబ్బంది సంక్షేమ రుసుము', 'ఉద్యోగుల సంక్షేమ రుసుము', 'సర్వీస్ ఫీజు', 'హాస్పిటాలిటీ ఛార్జీ' వంటి పేర్లు పెట్టినా అది సర్వీస్ ఛార్జీగానే పరిగణిస్తామని, పేరు మార్చి నిబంధనలను తప్పించుకోలేరన్నారు. సర్వీస్ ఛార్జీ చెల్లించలేదని సేవలు నిరాకరించడం, ప్రవేశం నిలిపివేయడం వంటివి చేయరాదని పేర్కొన్నారు. బిల్లులో ప్రతి సేవకు సంబంధించిన రుసుమును స్పష్టంగా చూపించాలని, ఆహార బిల్లులో సర్వీస్ ఛార్జీ కలిపి దానిపై జీఎస్టీ విధించరాదని తెలిపారు. అధికారులు ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## పాపాగ్నిలోకి 0.20 టీఎంసీల నీరు విడుదల

**తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ విజ్ఞప్తి**



వైఎస్సార్ జిల్లాలో చక్రాయపేట, వేంపల్లి మండలాల తాగునీటి సమస్య పరిష్కారానికి వెలిగల్లు జలాశయం నుంచి పాపాగ్ని నదిలోకి 0.20 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జలవనరుల శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు సెప్టెంబర్ 16న ఆ శాఖ చీఫ్ ఇంజినీర్‌కు లేఖ రాశారు. పాపాగ్ని నదీగర్భంలోని ఇంకుడు బావులు ఎండిపోవడంతో పలు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని గ్రామాల ప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. వర్షపాతం లోపంతో పాటు నదీ పరివాహక ప్రాంతంలో అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా భూగర్భ జల మట్టాలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. వెలిగల్లు నుంచి నీటిని విడుదల చేస్తే నదీగర్భం, ఇంకుడు బావులు పునరుజ్జీవించి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభావిత గ్రామాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# వెయ్యి డెబిట్ కార్డులతో రూ.92 కోట్లు



**ఎఫ్సీఆర్ఏ లేకుండానే నగదు ప్రవాహం**

అమెరికాకు చెందిన క్రైస్తవ మత ప్రచార సంస్థ ది తిమోతీ ఇనిషియేటివ్ (టీటీఐ) కార్యకలాపాలపై కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణలో భారీగా విదేశీ నిధుల ఉపసంహరణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎఫ్ సీఆర్ ఏ రిజిస్ట్రేషన్ లేకుండానే విదేశాల నుంచి వచ్చిన సుమారు రూ.92.55 కోట్లను డెబిట్ కార్డుల ద్వారా ఏటీఎంల నుంచి నగదుగా తీసుకున్నట్లు సీబీఐ ఎఫ్ ఐఆర్ లో ఆరోపించింది. 2025 నవంబర్ నుంచి 2026 ఏప్రిల్ వరకు ట్రూయిస్ట్ బ్యాంక్ జారీ చేసిన కార్డులతో 99,95,240 అమెరికన్ డాలర్లు ఉపసంహరించినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది. కర్ణాటక, ఛత్తీస్ గఢ్, అసోం సహా పలు రాష్ట్రాల్లో ఈ లావాదేవీలు జరిగినట్లు తెలిపింది. ఈ నిధులను పేదల శిక్షణ, మత ప్రచార కార్యకలాపాలకు వినియోగించడంతో పాటు వామపక్ష తీవ్రవాదానికి దారితీసే విధంగా ప్రజలను ప్రభావితం చేశారన్న ఆరోపణలు కూడా ఎఫ్ ఐఆర్ లో నమోదయ్యాయి.

**24 కార్డులతో విమానాశ్రయంలో పట్టుబాటు**

ఈ కేసులో టిటీఐతో పాటు ఆరుగురిపై సీబీఐ కేసు నమోదు చేసింది. బెంగళూరు విమానాశ్రయంలో ఏప్రిల్ 18న మైకా మార్క్ 24 విదేశీ డెబిట్ కార్డులతో పట్టుబడినట్లు ఈడీ వెల్లడించింది. వాటిలో అనేక కార్డులు 'సంతోష్ కుమార్' పేరుతో ఉన్నట్లు గుర్తించింది. అనుమానం రాకుండా ఒకే పేరును ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థ ఆరోపించింది. భారత్ లో గత కొన్నేళ్లుగా 1,000కుపైగా డెబిట్ కార్డులు పంపిణీ చేసినట్లు ఎఫ్ ఐఆర్ లో పేర్కొన్నారు. టిటీఐ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్న మాథై నివాసంలో రూ.37 లక్షల నగదును ఈడీ స్వాధీనం చేసుకుంది. రాజన్ ను ఆపరేషన్ ఇన్ చార్జ్ గా, మాథైను ఆర్థిక వ్యవహారాల అధిపతిగా దర్యాప్తు పత్రాలు పేర్కొన్నాయి. సోదాల తర్వాత డేటా మాయం ఈడీ ఏప్రిల్ 18, 19 తేదీల్లో ఫెమా, ఆదాయ పన్ను చట్టాల కింద సోదాలు నిర్వహించిన అనంతరం టిటీఐ భారత కార్యకలాపాలకు సంబంధించిన డేటాను రిమోట్గా తొలగించినట్లు ఆరోపించింది. క్లౌడ్ డేటా, ల్యాప్ టాప్ సమాచారం, క్విక్ బుక్స్ లోని భారత కార్యకలాపాల వివరాలు అందుబాటులో లేకుండా పోయినట్లు పేర్కొంది. సోదాల సమయంలో సమాచారం కనిపించినా కొద్దిసేపటికే భారత డేటా నిలిపివేయబడిందని ఈడీ గుర్తించింది. ఈ వ్యవహారంపై జూన్ 4న కేంద్ర హోంశాఖకు ఎఫ్ ఐఆర్ నమోదుకు సిఫార్సు చేయగా, అనంతరం కేసును సీబీఐకి అప్పగించారు. దీంతో ఆగస్టు 27న టిటీఐతో పాటు నిందితులపై ఎఫ్ ఐఆర్ నమోదైంది. విదేశీ నిధుల ప్రవాహం, కార్డుల వినియోగం, నగదు ఉపసంహరణలు, డేటా తొలగింపు వెనుక ఉన్న పూర్తి వ్యవహారాన్ని పరిశీలిస్తున్నాయి.




**ధరణి నుంచి భూ భారతి వరకు భూయుద్ధం తెలంగాణ అసెంబ్లీ వేదికగా మొదలైన భూముల లెక్కల యుద్ధం ఇప్పుడు రాజకీయ తుఫానుగా మారింది. ఒకవైపు ధరణి పేరుతో గత పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు.. మరోవైపు భూ భారతి పేరుతో ప్రస్తుత సర్కార్‌ను బీఆర్‌ఎస్ నిలదీత.. మధ్యలో వేలాది ఎకరాల భూములు, కోట్ల రూపాయల విలువైన ఆస్తులు, 22ఏ నిషేధిత జాబితా! కేసీఆర్ కుటుంబ భూములపై సభలో రేవంత్ వెల్లడించిన వివరాలు సంచలనం రేపగా.. ఎర్రవెల్లి ఫాంహౌస్‌పై తక్షణ విచారణకు ఆదేశాలు మరింత ప్రకంపనలు సృష్టించాయి. 700 ఎకరాల ఫాంహౌస్‌లో 388 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందా? ఉంటే 30 రోజుల్లో స్వాధీనం చేసుకుని పేదలకు, ఎస్సీలకు పంచుతామన్న సీఎం ప్రకటన ఇప్పుడు అసలు రాజకీయ బాంబుగా మారింది. కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర బీఆర్‌ఎస్ నేతల భూములపై కూడా రేవంత్ ఆరోపణలు గుప్పించారు. ధరణి నిర్వహణ వ్యయం రూ.58 కోట్ల అంచనా నుంచి రూ.1,300 కోట్లకు ఎలా చేరిందన్న ప్రశ్నతో గతాన్ని తవ్విన సీఎం.. 22ఏ జాబితాలోని భూముల లెక్కలతో మరో ఫైల్ తెరిచారు. దీనికి హరీశ్‌రావు ధీటైన కౌంటర్ ఇస్తూ ధరణితో పాటు భూ భారతి లావాదేవీలపైనా స్వతంత్ర న్యాయ విచారణకు సవాల్ విసిరారు. ఆరోపణలు.. ప్రత్యారోపణలు.. లెక్కలు.. ఫాంహౌస్‌లు.. నిషేధిత భూములు! చివరికి ప్రతి ఎకరా వెనుక ఉన్న అసలు రికార్డు ఏం చెబుతుందన్నదే ఇప్పుడు తెలంగాణను కుదిపేస్తున్న కీలక ప్రశ్న.**

# తెలంగాణలో 'భూ'కంపం

## బీఆర్‌ఎస్ హయాంలో లక్ష కోట్ల భూకుంభకోణం

### అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సంచలనం

### కేసీఆర్ ఫామ్‌హౌజ్‌పై విచారణకు సీఎం ఆదేశం

### మీ భూములు, మా భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా? హరీశ్ సవాల్




**• రేవంత్ రూట్‌లో ధరణి దూకుడు**

అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రధానంగా ధరణి వ్యవస్థ చుట్టూనే సాగింది. ధరణి కేవలం కంప్యూటరీకరణ ప్రక్రియగా ప్రారంభమైందని, ఆ తర్వాత దాని అమలులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. లక్షల కోట్ల విలువైన భూములు కొందరి చేతుల్లోకి వెళ్లిపోయాయంటూ డైరెక్ట్‌గా కేసీఆర్ ఫ్యామిలీని సీఎం టార్గెట్ చేశారు. కాస్రా పహాణి వంటి పాత రికార్డుల్లో పేదల భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా ఉండేవని, ధరణి ప్రక్రియలో వాటి ప్రాధాన్యం తగ్గిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల భూ హక్కులకు సంబంధించిన అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. కేసీఆర్ పాలనలో మండల స్థాయిలో ఉన్న భూ రికార్డుల వ్యవస్థను కలెక్టర్ స్థాయికి తీసుకెళ్లడం వల్ల క్షేత్రస్థాయి పరిశీలన బలహీనపడిందని సీఎం వాదించారు. ధరణి ద్వారా భూ రికార్డులను డిజిటల్ చేసినా, దాని వెనుక జరిగిన నిర్ణయాలు సమస్యలకు దారితీశాయని ఆయన ఆరోపించారు. భూదాన్ భూముల విషయంలో కూడా అక్రమాలు జరిగాయని, వాటిని వెలుగులోకి తీసుకొస్తానని ప్రకటించారు. భూముల కోసం పోరాటం చేసిన వామపక్ష ఉద్యమాన్ని గుర్తు చేస్తూ, భూముల పంపిణీలో కాంగ్రెస్ పాత్రను సీఎం ప్రస్తావించారు. సీలింగ్ చట్టం ద్వారా పేదలకు భూమి హక్కులు కల్పించడంలో ఇందిరాగాంధీ ప్రభుత్వ పాత్ర ఉందన్నారు. భూమి అంటే కేవలం ఆస్తి కాదు.. పేద కుటుంబానికి జీవనాధారం అనే రాజకీయ సందేశాన్ని కూడా రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో ముందుకు తెచ్చారు. ధరణి వ్యవస్థలో జరిగిన పరిణామాలను గత పాలనతో ముడిపెట్టి, భూ భారతి ద్వారా రికార్డులను సరిచేసే ప్రయత్నం చేస్తున్నామని ఆయన వివరించారు. ధరణి నిర్వహణకు మొదట ఐదేళ్లకు రూ.58 కోట్ల అంచనా ఉండగా అది రూ.1,300 కోట్లకు ఎలా పెరిగిందనే ప్రశ్నను కూడా సీఎం లేవనెత్తారు. ఈ లెక్కలకు గత పాలకులే సమాధానం చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**• కేసీఆర్ ఫాంహౌస్‌పై రేవంత్ కీలక ఆదేశాలు**

అసెంబ్లీ వేదికగా కేసీఆర్ కుటుంబ భూములపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. గజ్వేల్ ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌పై తక్షణమే నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని, నిర్లక్ష్యం చేస్తే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఫాంహౌస్ పరిధిలో 700 ఎకరాల భూమి ఉందని, అందులో 388 ఎకరాలు ప్రభుత్వ భూమిగా ఉన్నాయా అనే అంశాన్ని తేల్చాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూమి ఉంటే స్వాధీనం చేసుకుని పేదలకు, ఎస్సీలకు కేటాయిస్తామని ప్రకటించారు. కల్వకుంట్ల కుటుంబానికి తొమ్మిది జిల్లాల్లో 24 మండలాలు, 31 గ్రామాల్లో 439 ఎకరాల భూములు ఉన్నాయని రేవంత్ సభలో వివరించారు. కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123, హరీశ్‌రావు కుటుంబానికి 30, కవిత కుటుంబానికి 37, సంతోష్‌రావు కుటుంబానికి 79, నవీన్‌రావుకు 52, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉన్నాయని పేర్కొన్నారు. సత్యం స్కాం భూములు, ధరణి, 22ఏ నిషేధిత భూముల వ్యవహారాల్లోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబానికి తొమ్మిది జిల్లాల్లోని 24 మండలాలు, 31 గ్రామాల్లో కలిపి 439 ఎకరాల భూములు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్ విషయంలో తాను ఎందుకు బాంబులు వేస్తానని ప్రశ్నిస్తూ, "ఆయనేమైనా బిన్‌లాడెనా? రోడ్డుపై పిచ్చికుక్క కూడా కరవదు" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు స్టీఫెన్‌సన్‌కు నజరానా ఇచ్చారని ఆరోపించిన సీఎం.. రూ.50 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.1.53 కోట్లకే రెగ్యులరైజ్ చేశారని పేర్కొన్నారు. గంగుల, ఎర్రబెల్లి, సుధీర్‌రెడ్డి కలిసి 650 ఎకరాల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి 50 ఎకరాల ఫామ్‌హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. పైలట్ రోహిత్‌రెడ్డి అజీజ్‌నగర్‌లో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. చట్ట ప్రకారం ఒక కుటుంబానికి కుష్కి భూమి 54 ఎకరాలు, తరి భూమి 27 ఎకరాల వరకు మాత్రమే ఉండాలని చెబుతూ.. కేసీఆర్ వద్ద ఉన్న భూమంతా తరి భూమిగానే నమోదైందని రేవంత్‌రెడ్డి సభలో వివరించారు. కేటీఆర్ జన్వాడ ఫాంహౌస్, హరీశ్‌రావు ఫాంహౌస్ భూములపైనా విచారణ అవసరమని సీఎం పేర్కొన్నారు.

**• 22ఏపై సీఎం లెక్కల యుద్ధం**

22ఏ నిషేధిత భూముల అంశంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వివరించే ప్రయత్నం చేసింది. భూముల రికార్డుల నవీకరణ సమయంలో పార్ట్‌ఏ, పార్ట్‌బీగా విభజన జరిగిందని, పార్ట్‌బీలోని అనేక భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లాయని సీఎం వివరించారు. అటవీ, అసైన్డ్, దేవాదాయ, ప్రభుత్వ భూములు వంటి భూములు నిషేధిత జాబితాలో ఉండాల్సిందేనని ప్రభుత్వం చెబుతోంది. ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూముల విషయంలోనే అసలు వివాదం ఉందని సీఎం పేర్కొన్నారు. తన ప్రసంగంలో 21.93 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయన్న అంశాన్ని ప్రస్తావిస్తూ, రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయారని చెప్పారు. దళారుల వ్యవస్థ ఈ సమస్యను మరింత క్లిష్టం చేసిందని ఆరోపించారు. నిషేధిత జాబితాలో మొత్తం దాదాపు కోటి ఎకరాల భూమి ఉందని జరుగుతున్న ప్రచారాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. ప్రైవేట్ భూముల విషయంలో వివాదాస్పదంగా ఉన్న విస్తీర్ణం చాలా తక్కువగా ఉందని ప్రభుత్వం చెబుతోంది. 22ఏ నిబంధన కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది కాదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999లోనే సంబంధిత చట్టపరమైన వ్యవస్థ అమల్లోకి వచ్చిందని సీఎం వివరించారు. 2025లో హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కలెక్టర్ల నుంచి జాబితాలు తెప్పించి నిషేధిత జాబితా ప్రక్రియను చేపట్టామని చెప్పారు. ధరణి నుంచి నిషేధిత జాబితాలో ఉన్న భూముల విస్తీర్ణం 7 లక్షలకు పైగా ఉండగా, 2026 నాటికి అది 3 లక్షలకు పైగా తగ్గిందని సీఎం వెల్లడించారు. ప్రభుత్వం తప్పులు గుర్తించిన చోట సవరణలు చేస్తోందని, భూములను కాపాడటమే లక్ష్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణ భూ క్రమబద్ధీకరణకు త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని, రిజిస్ట్రేషన్ ప్రక్రియతో పాటు క్రమబద్ధీకరణను సమన్వయంతో నిర్వహిస్తామని చెప్పారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ పరిధిలోని లేఅవుట్ల సమస్యలకు ప్రత్యేక మార్గదర్శకాలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సింగరేణి ప్రాంత భూ సమస్యల కోసం ఉన్నతస్థాయి జిల్లా కమిటీ, ఎల్‌బీనగర్ ప్రాంత సమస్యల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జీవో 118 పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని, ఇందిరమ్మ లబ్ధిదారుల భూములకు ఐదేళ్ల లాకింగ్ పీరియడ్ తర్వాత విక్రయానికి అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

**• హరీశ్ కౌంటర్.. జ్యుడీషియల్ ఛాలెంజ్**

సీఎం ప్రసంగానికి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ప్రతిస్పందించారు. అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి చెప్పిన అంశాలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో ధరణిలో జరిగిన వ్యవహారాలపై విచారణకు సిద్ధమేనని, అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ భారతి ద్వారా జరిగిన పరిణామాలపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తితోనైనా, హైకోర్టు సిట్టింగ్ జడ్జితోనైనా విచారణ జరిపేందుకు సిద్ధమని హరీశ్‌రావు రేవంత్‌రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. కేవలం అధికారుల ఆధ్వర్యంలో జరిగే విచారణ కాకుండా స్వతంత్ర న్యాయ విచారణ కావాలని ఆయన పట్టుబట్టారు. 22ఏ జాబితాలో సాధారణ ప్రజల భూములు చేరితే వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, అదే సమయంలో ముఖ్యమంత్రి కుటుంబానికి సంబంధించిన భూముల విషయంలో మాత్రం వేగంగా పరిష్కారం లభించిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించి ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇల్లు 22ఏ జాబితాలోకి వెళ్లి తర్వాత తొలగించబడిందన్న అంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రజల భూములకు కూడా అదే విధమైన వేగంతో పరిష్కారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై, కేటీఆర్‌పై, బీఆర్‌ఎస్ నేతలపై ఆరోపణలు చేస్తోందని హరీశ్‌రావు అన్నారు. గత ప్రభుత్వ కాలంలో ధరణి వ్యవస్థలో జరిగిన అంశాలతో పాటు 2023 డిసెంబర్ 7 తర్వాత భూ భారతి అమల్లో జరిగిన ప్రతి లావాదేవీని పరిశీలించాలని కోరారు. తన ఆస్తులు, రేవంత్‌రెడ్డి ఆస్తులు, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తుల పెరుగుదలపైనా విచారణ జరిపించేందుకు సిద్ధమని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాల భూమి ఉందని తమకు సమాచారం అందిందని, ఆ భూముల పరిసరాల్లో ఓఆర్‌ఆర్ అలైన్‌మెంట్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుల అంశాలను పరిశీలిస్తున్నామని హరీశ్‌రావు చెప్పారు.

**• బాక్స్ బద్దలయ్యే ప్రశ్న.. ఎవరి లెక్క నిజం?**

ఇప్పటి వరకు సాగిన పరిణామాలు చూస్తే తెలంగాణ రాజకీయాల్లో భూముల అంశం మరోసారి ప్రధాన కేంద్రంగా మారినట్టే కనిపిస్తోంది. రేవంత్‌రెడ్డి ఆరోపణల సారాంశం.. ధరణి రూపకల్పనలో జరిగిన తప్పులు, పాత భూ రికార్డుల తొలగింపు, నిషేధిత జాబితా వ్యవస్థ, భూ లావాదేవీల్లో జరిగిన అక్రమాలపై గత ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్. హరీశ్‌రావు కౌంటర్ మాత్రం.. బీఆర్‌ఎస్ కాలం నుంచి కాంగ్రెస్ పాలన వరకు మొత్తం వ్యవహారాన్ని ఒకే న్యాయ విచారణ పరిధిలోకి తీసుకురావాలన్నది. 22ఏ జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రభుత్వం ఇప్పటికే కొన్ని సవరణలు చేపట్టినట్లు చెబుతోంది. ప్రైవేట్ భూముల విస్తీర్ణం తగ్గిందని అధికారిక వాదన. మరోవైపు బీఆర్‌ఎస్ మాత్రం ప్రజలు ఇంకా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని చెబుతోంది. ఈ రెండు వాదనల మధ్య అసలు పరీక్ష రికార్డులే. ఎన్ని ఎకరాలు ఎప్పుడు జాబితాలోకి వచ్చాయి? ఎవరి ఆదేశాలతో వచ్చాయి? ఎన్ని భూములు తొలగించారు? ఎందుకు తొలగించారు? ఎవరికి నష్టం జరిగింది? ఎవరికి లాభం కలిగింది? అనే ప్రశ్నలకు స్పష్టమైన అధికారిక సమాధానాలు వస్తేనే వివాదానికి పూర్తి రూపం తెలుస్తుంది. రేవంత్‌రెడ్డి భూ భారతి ద్వారా సమస్యలను సరిచేస్తామని చెబుతుండగా, హరీశ్‌రావు న్యాయ విచారణకు సవాల్ విసురుతున్నారు. రాజకీయ ఆరోపణల స్థాయి దాటి రికార్డులు ప్రజల ముందుకు రావడం, జిల్లా వారీగా గణాంకాలు వెల్లడించడం, తప్పుగా చేర్చిన భూములను వేగంగా తొలగించడం, ప్రభుత్వ భూములను కాపాడటం ఇప్పుడు కీలకంగా మారాయి. అసెంబ్లీలో మొదలైన ఈ భూ యుద్ధం ఇక కేవలం ధరణి వర్సెస్ భూ భారతి పోరాటంగా ఉండకపోవచ్చు. ప్రతి ఎకరా వెనుక ఉన్న రికార్డు.. ప్రతి కుటుంబం వెనుక ఉన్న హక్కు.. ప్రతి ఆరోపణ వెనుక ఉన్న ఆధారం బయటపడాల్సిన దశ ఇది. ఎవరి వాదన బలంగా ఉందన్నది రాజకీయ సభలు నిర్ణయించవు... అధికారిక రికార్డులు, స్వతంత్ర విచారణ, న్యాయపరమైన పరిశీలన నిర్ణయించాల్సిన అంశంగా ఇది మారింది.




**• భూ భారతి ఎక్కడ.. ధరణి ఎక్కడ?**

హరీశ్‌రావు తన కౌంటర్‌లో భూ భారతి వ్యవస్థపైనా ప్రశ్నలు లేవనెత్తారు. ఒక జిల్లాలోనే రూ.80 లక్షల చలాన్లకు సంబంధించిన అక్రమాల ఆరోపణలు వచ్చాయని, అయినా బాధ్యులపై చర్యలు కనిపించడం లేదని ఆయన అన్నారు. ప్రజలకు తెలియకుండానే ఒకరి ఆస్తి మరొకరి పేరుకు మారిన సందర్భాలు ఉన్నాయని ఆరోపించారు. అసైన్డ్ భూములు పట్టా భూములుగా, పట్టా భూములు అసైన్డ్ భూములుగా మారిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. భూ భారతి ద్వారా ఇప్పటికే 9,200కుపైగా అక్రమ లావాదేవీలు జరిగాయని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ ఆరోపణలన్నింటిపై ప్రభుత్వం సమగ్ర విచారణకు సిద్ధపడాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం భూ భారతి ద్వారా రికార్డుల సవరణ ప్రక్రియ కొనసాగుతోందని చెబుతోంది. రెవెన్యూ శాఖ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారానికి పలు చర్యలు ప్రారంభించిందని ప్రభుత్వం వివరిస్తోంది. నిషేధిత భూముల జాబితాలో తప్పుగా చేరిన ప్రైవేట్ భూములను పరిశీలించి తొలగించే విధానం అమల్లో ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. 22ఏ జాబితాలో ఉన్న భూములపై ప్రజలకు స్పష్టత ఇవ్వడం, నిజమైన హక్కుదారులకు ఇబ్బందులు లేకుండా చేయడం, ప్రభుత్వ భూములను కాపాడడం మధ్య సమతుల్యత అవసరమని ప్రభుత్వం చెబుతోంది. ఇక్కడే అసలు రాజకీయ పోరు మొదలవుతోంది. 'ఎవరు భూములను జాబితాలో చేర్చారు?' అన్నది చెప్పాలని బీఆర్‌ఎస్ ప్రశ్నిస్తోంది. అదే సమయంలో 'ధరణి కాలంలో భూ రికార్డుల్లో ఏం జరిగింది?' అన్నది తేలాలంటోంది సర్కార్. ఒక పార్టీ గతాన్ని చూపిస్తుంటే మరో పార్టీ వర్తమానాన్ని చూపిస్తోంది. రెండు వైపులా ఆరోపణలు తీవ్రమవుతున్నా, ప్రజలకు కావాల్సింది మాత్రం తమ భూమి రికార్డు సరిగ్గా ఉందా లేదా అన్న స్పష్టత. భూమి రిజిస్ట్రేషన్ ఆగిపోవడం, బ్యాంకు రుణాలు నిలిచిపోవడం, కుటుంబ అవసరాలకు ఆస్తి విక్రయించలేకపోవడం వంటి సమస్యలు ఎదురైతే రాజకీయ వాదనలు ప్రజలకు తక్షణ పరిష్కారం ఇవ్వవు. అందుకే రికార్డుల పరిశీలన, డిజిటల్ డేటా ధ్రువీకరణ, అధికారుల బాధ్యత, అప్పీల్ వ్యవస్థ, న్యాయపరమైన పర్యవేక్షణ కీలకంగా మారుతున్నాయి.

